ఆ ప్రయాణం.. నరకం

- మల్కాపురం–సింథియా రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్
- ఇరుకైన రోడ్డులో అవస్థలు పడుతున్న వాహన చోదకులు



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ప్రధాన రహదారిపై భారీ వాహనాల పార్కింగ్



మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద నిలిపిన వాహనాలు



కేంద్రీయ విద్యాలయం గేటు పరిసరాల్లో పార్క్‌చేసిన భారీ వాహనాలు

సింధియా: మల్కాపురం నుంచి సింధియా వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణమంటేనే ద్విచక్ర వాహన చోదకులు హడలెత్తిపోతున్నారు. గాజువాక నుండి శ్రీహరిపురం, మల్కాపురం మీదుగా సింధియా వెళ్లే రోడ్డులో నిత్యం అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయితే శ్రీహరిపురంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్, మల్కాపురంలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి పరిశ్రమలకు నిత్యం మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుండి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఆ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేసి రోజుల తరబడి వదిలేస్తుండడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉన్నా కూడా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రోజుల తరబడి పార్కింగ్..

పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను రోజుల తరబడి రోడ్డుపైనే పార్కింగ్ చేసి ఉంచడంతో ఆయా వాహనదారులు రోడ్ల మీదే స్నానపానాలు, వంటావార్పు వంటి దైనందిన కార్యకలాపాలు చేసుకుంటుండడంతో ఈ మార్గంలో తిరుగాడే వారు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఆ వాహనాల సిబ్బంది రోడ్డు మీద.. డివైడర్లపైన కునుకు తీస్తుండడంతో మరింత ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో వీధి దీపాలు సరిగ్గా వెలగకపోవడంతో రోడ్డుపై పార్కింగ్ చేసి ఉంచిన భారీ వాహనాలను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై పార్కింగ్ చేసి ఉంచుతున్న భారీ వాహనాలకు ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తున్నా ఎటువంటి మార్పు రావడం లేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్యను చక్కదిద్దాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భారీ వాహనాలను నిరోధించాలి



మల్కాపురం నుంచి సింధియా వరకు ప్రధాన రహదారిపై భారీ వాహనాలను పార్కింగ్ చేయకుండా నిరోధించాలి. ఈ మార్గంలో ప్రయాణమంటేనే భయమేస్తోంది. రాత్రి వేళల్లో భయంతో ప్రయాణాలు మానుకుంటున్నాం. పరిశ్రమల నుండి వెలవడే కాలుష్యంతో ఒక పక్క సతమతమవుతుంటే, మరో పక్క ఇలా భారీ వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– పద్మ, స్థానికురాలు

రాకపోకలకు ఇబ్బందులు



మల్కాపురం నుంచి సింధియా వరకు ఉన్న ప్రధాన రహదారిపై పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను పార్కింగ్ చేసి ఉండడంతో సాధారణ వాహనాల రాకపోకలకు తరచూ ఇబ్బందిగా ఉంది. ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తడమే కాకుండా చుట్టుపక్కల ఉంటున్న వారికి సైతం సమస్యగా మారుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సతీష్, ప్రయాణికుడు

చర్యలు తీసుకుంటున్నాం

రోడ్డుపై పార్కింగ్ చేసి ఉంచుతున్న భారీ వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. సంచార వాహనాల ద్వారా నిత్యం అవగాహన కలిగిస్తున్నాం. పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రజల్లో సైతం చైతన్యం వచ్చే దిశగా నిత్యం అవగాహన సదస్సులు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం.

కాళిదాస్, ట్రాఫిక్ సీఐ, మల్కాపురం

అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



విమాన్‌నగర్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ బొమ్మిడి రమణ

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 90, 91 వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం: అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. 90, 91 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక విశాఖ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, పర్యాటకానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. మరింత సుందరంగా నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నగరాభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే గెలిపిస్తాయి: ఆడారి ఆనంద్‌కుమార్

ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విశాఖలో వైఎస్సార్‌సీపీ పాగా వేయడం ఖాయమని జోస్యం చెప్పారు. సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పాత హామీలు నెరవేర్చని, డాష్ బోర్డులో హామీల చిట్టాను తొలగించిన ప్రతిపక్ష నేత చంద్రబాబు.. కొత్తగా మరో చిట్టా పట్టుకుని వస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయనను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు..

గోపాలపట్నంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్ గుర్తించిన సమస్యలను పరిష్కరించే విధంగా సచివాలయం నిధులతో నేతాజీ కాలనీలో రూ.3.86 లక్షలతో సీసీ రోడ్డు, పాత గోపాలపట్నంలో రూ.16 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆడారి శంకుస్థాపన చేశారు. ఆయనతోపాటు జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఉన్నారు.

- 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్–బ్లాక్‌లో రూ.17.2 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం, వినోద్ నగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణం, విమాన్‌నగర్‌లో రూ18.28 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ హరివెంకటకుమారి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు, ఈఈ సంతోషికుమారి, ఏఈ వెంకటలక్ష్మి, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మడి రమణ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు చుక్క ప్రసాదరెడ్డి, గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, గేదెల మురళీకృష్ణ, పి.నూకరాజు, పసుపురెడ్డి రమణ, పి.శంకరరావు, స్థానిక నాయకులు నమ్మి శ్రీను, యల్లపు వెంకటేశ్వరరావు, ఊటపల్లి గోవింద్, శంషద్ బేగం, సత్యవతి, పిల్లల మాణిక్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో ప్రజల భాగస్వామ్యం



మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు కోరారు. 89వ వార్డు నాగేంద్ర కాలనీ సచివాలయంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచే తడి, పొడి, ప్రమాదకర చెత్తను పారిశుధ్య కార్మికులకు వేరు చేసి అందివ్వాలని కోరారు. రానున్న వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా, వైరల్ ఫీవర్ డెంగ్యూ వంటి వ్యాధులపై అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఎస్ఎస్ వెంకటరమణ, ఏపీడీ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



అలంకరణలో దుర్గమాంబ

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గాదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల కమిటీ సభ్యులు, సేవా దళం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఈఆర్‌ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఇంటక్ అదనపు ప్రధాన కార్యదర్శి రాజును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కార్మిక వర్గం చురుగ్గా పాల్గోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాజు కోరారు. ప్రైవేటీకరణ ఉద్యమం ప్రారంభం నుంచి ఐఎన్‌టీయూసీ చురుగ్గా వ్యవహరిస్తోందన్నారు. శుక్రవారం జరిగిన ఎలక్ట్రికల్ రిపేర్ షాప్ (ఈఆర్ఎస్) నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభాగం నూతన కన్వీనర్‌గా పి.వి.రాజు, అధ్యక్షునిగా అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, పి.ఎస్.ఎస్. ప్రసాద్, బి. శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సురేష్, సహాయ కార్యదర్శిగా కె. అప్పలరెడ్డి, కోశాధికారిగా నరేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ప్రధాన కార్యదర్శి రాజును నాయకులు సత్కరించారు.

60వ వార్డులో జీవీఎంసీ కమిషనర్ పర్యటన

- బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాల డంపింగ్‌పై ఆగ్రహం



స్థానిక సమస్యలపై ఆరా తీస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మల్కాపురం: జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ శుక్రవారం ఉదయం 60వ వార్డులో ఆకస్మికంగా పర్యటించారు. వుడా కాలనీ ఎంజీజీ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. విశాలమైన ఈ మైదానాన్ని ఎందుకు నిర్లక్ష్యంగా విడిచిపెట్టారని, దీనిని తక్షణం ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలోని బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించారు. ఇళ్ల ముందు చెత్త డంప్ చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. వ్యర్థాలను నిర్లక్ష్యంగా రోడ్డుపై వేయడం వల్ల కలిగే నష్టాలను, తడి, పొడి చెత్తను వేరు వేరుగా ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై జనంలో అవగాహన తీసుకురావాలని సూచించారు. అనంతరం మల్కాపురం నుంచి జింక్ వరకు సర్వీస్ రోడ్డులో భూగర్భ పైప్‌లైన్ కోసం తవ్విన గోతులను జీవీఎంసీ కమిషనర్ పరిశీలించారు. వెంటనే వాటిని పూడ్చాలని ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

తల్లి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు



ఆదిలక్ష్మి

మర్రిపాలెం: తన తల్లి కనిపించడం లేదని ఆమె కుమార్తె ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం బర్మా క్యాంప్ దరి ఏఎస్సార్ నగర్‌లో కర్రి ఆదిలక్ష్మ(66) తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 14 నుంచి ఆమె కనిపించడం లేదు. చుట్టుపక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో ఆదిలక్ష్మి కుమార్తె సూర్యకుమారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ఏకేసీ కాలనీ వాసులకు ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఏడీసీ సన్యాసిరావు ఆదేశాలతో బయాలజిస్ట్ చక్రవర్తి పర్యవేక్షణలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వార్డులో తొలిసారి పర్యటించిన జోన్–5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఇంట్లో నీటి పాత్రలను ఖాళీ చేసి సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందాలని సూచించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా.. వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా సూపర్‌వైజర్లు విజయకుమారి, దుల్లా శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



కణితి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయి సందర్శనకు వెళ్లినప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో విధిగా నమోదు చేసి వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాక్సిన్, ఓపీ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధంగా బుధవారం హెడ్ క్వార్టర్‌లోను, శనివారం పీహెచ్‌సీ పరిధిలో వ్యాక్సినేషన్ వేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాన్నంతా పరిశీలించారు. పీహెచ్‌సీ కొత్త భవనం సివిల్ వర్క్స్ కోసం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి పాత్రల శుభ్రతతో దోమల కట్టడి



శ్రీనివాసనగర్‌లో అవగాహన కల్పిస్తున్న మలేరియా నివారణ సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 26, 43 వార్డుల్లో శుక్రవారం జిల్లా మలేరియా సబ్‌యూనిట్ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది ఫ్రైడే–డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కయ్యపాలెం, ఎన్జీజీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్, నందగిరినగర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో మహిళలకు దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా మలేరియా సూపర్‌వైజర్లు సత్యానంద్, శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజులు దాటి వర్షపు నీరు, లేదా తాగునీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు శుభ్రపర్చి మళ్లీ పట్టుకోవాలని సూచించారు. నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది శివ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రెండో దశ బొప్పాయి మొక్కల పెంపకం



మొక్క నాటి నీరు పోస్తున్న సీజీఎం చంద్రశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం రెండో దశ బొప్పాయి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఉక్కునగరంలోని నాలుగు ఎకరాల్లో ఉన్న పండ్ల తోట మధ్యస్థలంలో 1500 మొక్కలను నాటడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగం సీజీఎం వై. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని కాపాడుతూ, ఉన్న భూమిలో ఖాళీగా ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు ఆగ్రోఫారెస్ట్ విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆగ్రోఫారెస్ట్ విభాగాధిపతి వి.ఎల్.పి. లాల్ తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

పెదగంట్యాడ: న్యూ పెంటమాంబ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు రామోజీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ శివాలయం ఆవరణలో వచ్చే నెల 31న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పోటీల ట్రోఫీని, పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జిమ్‌లు, బాక్సింగ్ క్లబ్ నుంచి సుమారు ఆరువేల మంది ఈ పోటీలకు హాజరు కానున్నారన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.20వేలు, మెడల్, సర్టిఫికెట్, రెండో బహుమతి కింద రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కిల్లాన ముసలయ్య, గూటూరు శంకరరావు, జాతీయ బాడీ బిల్డర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

గాజువాక: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని సీఎల్‌సీ మినిస్ట్రీస్ అధినేత బిషప్ ఆల్‌ఫ్రెడ్ మహంతి అన్నారు. మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్లతో సంపాదన ప్రారంభించి, కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మెర్సీ మహంతి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

నీరు లేక ఎండిపోతున్న మొక్కలు



కంచరపాలెం నేతాజీ వంతెనపై ఏర్పాటు చేసిన మొక్కలు

కంచరపాలెం: కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనపై ఏర్పాటు చేసిన పూల కుండీల్లోని మొక్కలు నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. జీవీఎంసీ జోన్–5 పరిధిలో హార్టికల్చర్ సిబ్బంది పూల కుండీల్లో మొక్కలకు నీరు పోయడం లేదు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎండలకు మొక్కలు వాడిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలకు నీరు పోసేలా చర్యలు తీసుకోవాలి.

– పిన్నింటి భరత్‌కుమార్, గొల్ల కంచరపాలెం

హాస్టల్‌లో పంట పండింది



హాస్టల్‌లో చెట్టుకు కాసిన మామిడి కాయను వీసీ ప్రసాదరెడ్డికి బహూకరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం విదేశీ విద్యార్థినుల హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు స్వయంగా పలు మొక్కలు నాటి పెంచుతున్నారు. గత సంవత్సరం కొన్ని మామిడి మొక్కలు నాటారు. ఈ సంవత్సరం వీటిలో ఒక మొక్క కాయలు కాయడం ప్రారంభించింది. ఈ మేరకు మొక్కకు కాసిన కాయను పలువురు వియత్నాం విద్యార్థులు ప్రత్యేకంగా తీసుకువచ్చి వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి బహూకరించారు. వియత్నాంకు చెందిన పరిశోధకులు, విద్యార్థులు స్వయంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను హాస్టల్ ఆవరణలో సాగు చేస్తున్నారు. తమ దేశానికి సంబంధించిన పలు మొక్కలు సైతం తీసుకువచ్చి ఇక్కడ హాస్టల్ చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో పెంచుతున్నారు. వారి ఆసక్తిని వీసీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీతంపేట: ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి శుక్రవారం ఉదయం ఆయన సీతంపేట హరిజన వీధి, కనకమ్మ వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నివాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్, పారిశుధ్యం, రేషన్ కార్డుల మంజూరు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కార్పొరేటర్ తెలియపర్చారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ అడ్మిన్ రాజశేఖర్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం



కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు అఘోర మృత్యుంజయ పాశుపత అభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమావాస్య సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.